సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

గురువారం । 8 । జూన్ । 2023



..ఆలస్యంగా 'గోల్కొండ'
మూడో రైల్వేలైన్ నిర్మాణ పనులతో పాటు పలు రైళ్ల రద్దుతో సికింద్రాబాద్ వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ నాలుగున్నర గంటలు ఆలస్యంగా నడిచింది. - 8లో▸



ఖాకీల 'ఎమోషనల్ కాంప్రమైజ్'!
లైంగిక నేరాల నుంచి బాలలను రక్షించేందుకు తీసుకొచ్చిన పోక్సో చట్టం 'ఎమోషనల్ కాంప్రమైజ్' ముందు వెలవెలబోతోంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
42^0 /30^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ (బీసీ) ప్రీ, పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతోపాటు, ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, స్టడీ సర్టిఫికేట్లతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు

భూపాలపల్లి అర్బన్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్), కార్మిక, ఉపాధి శిక్షణ ఆధ్వర్యంలో సెమీస్కిల్డ్ కార్మికులకు విదేశాల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్యామల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ దేశాలతో పాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్, పోలాండ్, రోమేనియా, యూకే వంటి వివిధ దేశాల్లో ప్రైవేట్ నమోదిత ఏజెన్సీలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. నేడు(గురువారం) జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఖాళీల వివరాలతో అభ్యర్థుల పేర్లు నమోదు చేసుకోనున్నట్లు పేర్కొన్నారు.

జూలై నుంచి నూతన వేతనాలు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులకు జూలై 1వ తేదీ నుంచి బొగ్గు రంగంలో పెరిగిన వేతనాలు అమలుల్లోకి వస్తాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంపేటి రాజయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. బొగ్గు గని కార్మికులకు 11వ వేజ్‌బోర్డు కొత్త పే స్కేలు ప్రయోజనంతో 19శాతం పెరిగిన వేతనాలు అమలవుతాయన్నారు. మెడికల్ అన్‌ఫిట్, వీఆర్‌ఎస్ పొందిన ఉద్యోగులకు 2017 జనవరి 1వ తేదీ నుంచి రావాల్సిన గ్రాట్యూటీ చెల్లించేందుకు కేంద్ర బొగ్గుశాఖ మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

తూకంలో తేడాలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని డీసీఎంఎస్ సెంటర్ నిర్వాహకుల తూకంలో 2కిలోల తేడా గుర్తించినట్లు సివిల్ సప్లయీస్ డీఎం రాఘవేంద్ర తెలిపారు. తూకంలో తేడాలపై స్థానిక ఎస్సై లక్ష్మణ్‌రావుకు గత మంగళవారం ఫిర్యాదు అందింది. ఈమేరకు డీఎం రాఘవేంద్ర బుధవారం తూకంలో తేడాలపై విచారణ చేపట్టి, తూకంలో మోసాన్ని గుర్తించి డీసీఎంఎస్ సెంటర్ లైసెన్స్ రద్దు చేసినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు బాధ్యతలను స్థానిక సెంటర్‌కు అప్పగించి, మోసాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు రైతులకు స్పష్టం చేశారు. ఆయన వెంట డీసీఎంఎస్ డీఎం, తూనికల కొలతల అధికారులు, స్థానిక ఎంపీటీసీ దుర్గయ్య, మాజీ ఎంపీపీ బాపు, రైతులు ఉన్నారు.

కేటీపీపీలో చోరీపై కొనసాగుతున్న విచారణ

గణపురం : మండలంలోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో కొద్ది రోజుల క్రితం జరిగిన చోరీపై విచారణ చేపట్టేందుకు డైరెక్టర్ థర్మల్ లక్ష్మయ్య, విజిలెన్స్ చీఫ్ ముత్యం రెడ్డిలు బుధవారం రాత్రి కేటీపీపీని సందర్శించారు. కేటీపీపీలో రూ.82,32,900 విలువైన యంత్రాలు చోరీకి గురికావడంతో స్పందించిన వారు ప్లాంట్‌ను సందర్శించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీపీపీలో ఈ నెల 3న కేటీపీపీకి చెందిన అధికారులు స్టోర్ రూంలో తనిఖీ చేయగా విలువైన మెటీరియల్ బాయిలర్, టర్బైన్, కామన్ యాక్సలరీలకు సంబంధించిన స్పేర్ ఐటమ్స్, కూల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, డైషా వాల్వ్స్, కరెంట్ బోల్ట్ ఇన్సులేటెడ్, సీల్ ఆష్ బూసింగ్, లైనర్ యాడ్పటర్ మొదలైన సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని గుర్తించారు. సామగ్రి విలువ రూ.82,30,900 వరకు ఉంటుందని గణపురం ఎస్సై అభినవ్‌కు కేటీపీపీ స్టోర్ డీఈ కొండ రాజ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆందోళన!

కాళేశ్వరం: అన్నారంలోని సరస్వతీ బ్యారేజీ వద్ద సాగునీటి దినోత్సవంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆందోళన చేశారు. బుధవారం రాత్రి స్టేజీపై జెడ్పీచైర్‌పర్సన్ శ్రీహర్షిణికి మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కార్యకర్తలు ఆందోళనకు దిగారు. వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్, జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి మాట్లాడుతుండగా కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర నియోజకవర్గాల వారు మా నియోజకవర్గానికి వచ్చి మాట్లాడడం ఏంటని అడ్డుకునే ప్రయత్నం చేశారు. తమ నాయకురాలు జెడ్పీ చైర్‌పర్సన్‌కు అవకాశ ఇవ్వకుండా చూస్తున్నారని ఆందోళనకు దిగారు. మంత్రి సత్యవతి రాథోడ్ కల్పించుకున్నప్పటికీ ఆందోళన ఆగలేదు. పోలీసులు చేరుకొని ఆందోళన చేస్తున్న కార్యకర్తలను నిలువరించారు.

జన్ ఆరోగ్య సమితులు

ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటుకు చర్యలు
- పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, హెల్త్ సబ్ సెంటర్లలో కమిటీలు
- ప్రతి నెలా మూడో శనివారం సమావేశం
- ప్రజా వైద్యం, నిధుల వినియోగంపై పర్యవేక్షణ



గణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

భూపాలపల్లి అర్బన్: ఆరోగ్య కేంద్రాలను ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లుగా గుర్తించి పటిష్ఠ నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, నిర్వహణ, నిధుల వినియోగం, రోగుల సంక్షేమాన్ని పర్యవేక్షించడానికి 'జన్ ఆరోగ్య సమితి'ల ఏర్పాటుకు మార్గదర్శకాలు విడుదల చేసింది. జిల్లాలోని 90 హెల్త్ సబ్ సెంటర్లు (పల్లె దవాఖానాలు), 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ), ఒక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహె చ్‌సీ)లలో 'జన్ ఆరోగ్య సమితి'లు ఏర్పాటు చేయనున్నారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) పేరిట కమిటీలుండేవి. ఇప్పుడు హెచ్‌డీఎస్ స్థానంలో 'జన్ ఆరోగ్య సమితి'ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రతీ నెలా మూడో శనివారం కమిటీల సమావేశం నిర్వహిస్తారు. ఆయా ఆరోగ్య కేంద్రాల్లోకి వచ్చే రోగుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలు, ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, వసతులు, సౌకర్యాలు, వైద్య పరికరాల, అవసరమైన మందుల కొనుగోలు, వచ్చిన నిధుల వినియోగం, ఖర్చు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి చర్యలు తీసుకోనున్నారు.

పక్కాగా నిర్వహణ

జన్ ఆరోగ్య సమితి కమిటీల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో చైర్మన్‌గా ఎంపీపీ, వైస్ చైర్మన్‌గా డిప్యూటీ డీఎంహెచ్ఓ, మెంబర్ సెక్రటరీలుగా మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సు, ఏఎన్‌ఎం, సీడీపీఓ, లేదా ఐసీడీఎస్ సూపర్‌వైజర్, తహసీల్దార్, ఎంఈఓ స్పెషల్ ఇన్వైట్‌గా టీబీ విభాగం సూపర్‌వైజర్, వీహెచ్‌ఎస్‌ఎన్‌సీ చైర్మన్ లేదా సభ్యుడు లేదా స్వయం సహాయ సంఘాల సభ్యులు ఉంటారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ) స్థాయిలో చైర్మన్‌గా ఏరియా వార్డు సభ్యుడు, కో చైర్మన్ మెంబర్, సెక్రటరీలుగా మెడికల్ ఆఫీసర్, ఎక్స్ అఫిషియో మెంబర్లుగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి, సభ్యులుగా మహిళా స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలు, స్పెషల్ ఇన్వైట్స్‌గా విలేజ్ హెల్త్ శానిటేషన్ అండ్ న్యూట్రిషన్ కమిటీ (వీహెచ్‌ఎస్ఎన్‌సీ) సభ్యులు ఉంటారు. హెల్త్ సబ్ సెంటర్ స్థాయిలో చైర్మన్‌గా సర్పంచ్, కో చైర్ పర్సన్‌గా సంబంధిత పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, మెంబర్ సెక్రటరీగా సంబంధిత హెల్త్ వెల్‌నెస్ సెంటర్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ), ఎక్స్ అఫిషియో మెంబర్లుగా విలేజ్ హెల్త్ శానిటేషన్ అండ్ న్యూట్రిషన్ కమిటీ అధ్యక్షులు, ఆశాలు ఉంటారు. ఆరోగ్య సమితి కమిటీ సమావేశంలో 50 శాతం కోరం తప్పనిసరి. ప్రస్తుతం ఆరోగ్య కేంద్రాల్లో మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన హెచ్‌డీఎస్ సమావేశాలు కొంత కాలంగా అటకెక్కాయి. చాలాచోట్ల నిధులు ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జన్ ఆరోగ్య సమితిలు ఏర్పాటయితే నిర్వహణ, నిధుల వినియోగంలో పారదర్శకత ఉంటుంది.

జవాబుదారీతనం పెరుగుతుంది



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖాలు, యూపీహెచ్‌సీలో హెచ్‌డీఎస్‌ల స్థానంలో జన్ ఆరోగ్య సమితిలు ఏర్పాటు చేస్తాం. పకడ్బందీగా ప్రతి నెలా సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. త్వరలో కమిటీలను ఏర్పాటు చేస్తాం. కమిటీలో ఉండే సభ్యులు ప్రతి ఒక్కరు సమావేశానికి హాజరై నిధుల వినియోగం, ఆరోగ్య సేవలు, సౌకర్యాలపై చర్చించి అడిగి తెలుసుకుంటు సూచనలు, సలహాలు ఇచ్చే అవకాశం ఉంటుంది.
- డాక్టర్ శ్రీరామ్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



పంబాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి రూరల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగాన్ని పండుగ చేసేందుకు సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో భూపాలపల్లి మండల పరిధిలోని పంబాపూర్‌లోని భీమ్ గణపురం చెరువు కట్టపై ఏర్పాటు చేసిన సాగునీటి దినోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో అటవీ గ్రామాల ప్రజలు కోలాటాలు, నృత్యాలతో ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పంబాపూర్ గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గం పరిధిలోని భూపాలపల్లి, చిట్యాల, టేకుమట్ల, రేగొండ, మొగుళ్లపల్లి, గణపురం, శాయంపేట మండలాల్లో భారీ ఆయకట్టు ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2017లో నీటిని ఎత్తిపోసేందుకు ఫేజ్ 3 క్రింద భీంఘన్‌పూర్ పంపు హౌస్ నిర్మించినట్లు తెలిపారు. మూడో దశ కింద 2020లో రామప్ప చెరువుకు నీటిని ఎత్తిపోయడం ప్రారంభించామన్నారు. మహా ముత్తారం మండలం నర్సింగాపూర్ చెరువుకు కూడా నీరు అందించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో అనేక చెక్ డ్యాముల నిర్మించామన్నారు. రాష్ట్రంలో మత్స్యశాఖ గణనీయమైన అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కళ్లెపు శోభ రఘుపతిరావు, ఎంపీపీ మండల లావణ్య సాగర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ గౌడ్, పంబపూర్ సర్పంచ్ బంటు అనూష రమేష్, బీఆర్‌ఎస్ మండల రూరల్ అధ్యక్షుడు పిన్‌రెడ్డి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో అధిక లాభం



కోళ్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్, సైంటిస్టులు

వాజేడు: రాజశ్రీ జాతి పెరటి కోళ్లు తక్కువ ఖర్చుతో విస్తృతంగా పెంచి అధిక లాభాలు పొందవచ్చని పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ డాక్టర్ అమరేశ్వరి, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ హనుమంతరావులు అన్నారు. మండల పరిధిలోని కడేకల్ గ్రామంలో 300 మంది రైతులకు 3,200 రాజశ్రీ పెరటి కోళ్లను ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద కృష్ణాపురం సర్పంచ్ పూనెం నాగచంద్ర బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వీటిని పంపిణీ చేసినట్లు తెలిపారు. పౌష్టికాహార లోపం నుంచి అధిగమించడానికి పెరటి కోళ్ల ద్వారా వచ్చే మాంసం, గుడ్లు ఉపయోగపడుతాయని వివరించారు. కోళ్లకు ప్రతీ మూడు నెలలకు ఒకసారి నట్టలనివారణ మందు వేయాలని సూచించారు. ప్రతీ 6 నెలలకు ఒకసారి టీకా మందును స్థానిక పశు వైద్యశాలలో తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చిట్టి బాబు, ఉప సర్పంచ్ భవాని, కార్యదర్శి ప్రసాద్, సిబ్బంది సంతోష్, కుమారస్వామి, ఖాజా ఖాన్, బాలరాజు పాల్గొన్నారు.

బీసీ కులవృత్తులకు రుణాలు



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

భూపాలపల్లి: బీసీ కుల వృత్తులు, చేతి వృత్తులు చేసుకునే వారికి ప్రభుత్వం రూ.లక్ష అందించే కార్యక్రమం ఈ నెల 9వ తేదీన ప్రారంభించనున్నట్లు రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఈ మేరకు మంత్రి కమలాకర్, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి శాంతికుమారిలతో కలిసి బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేష్‌మిశ్రా, అడిషనల్ కలెక్టర్ దివాకర, బీసీ సంక్షేమశాఖ అధికారిణి శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. ఈ నెల 9వ తేదిన నిర్వహించనున్న సంక్షేమ సంబురాల కార్యక్రమంలో చేతి వృత్తుల వారికి ఆర్థిక సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. అదే రోజు జిల్లాలో 50 మంది లబ్ధిదారులకు అందించాలని తెలిపార. ఈ నెల 20వ తేది వరకు దరఖాస్తులను స్వీకరించి, విచారణ చేపట్టి ప్రతి నెలా దశల వారీగా లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించాలన్నారు.

14న వైద్య దినోత్సవం

ఈ నెల 14వ తేదీన వైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించాలన్నారు. మహిళా ఉద్యోగులు, ఏఎన్‌ఎం, ఆశాలకు అవార్డులు అందజేసి మహిళ ఉద్యోగులకు చీరలు పంపిణీ చేయాలని తెలిపారు. ఏఎన్‌ఎంలకు బీపీ యంత్రాలను అందించాలని సూచించారు.

సాగునీటి సంబురం



బ్యారేజీని పరిశీలిస్తున్న ప్రజాపతినిధులు



శివతాండవం చేస్తున్న నృత్యకారులు

- సరస్వతీ బ్యారేజీ వద్ద వేడుకలు
- అలరించిన పేరిణి నృత్యాలు.. మంగ్లీ ఆటపాట
- చిరుజల్లులతో సభ నుంచి వెళ్లిపోయిన జనం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారంలోని సరస్వతీ బ్యారేజీ వద్ద సాగునీటి సంబురాలు వైభవంగా నిర్వహించారు. చల్లని వాతావరణం.. పొద్దంతా భానుడి ప్రతాపాన్ని మరిచిన జనం, అధికారులు బ్యారేజీ వద్ద నృత్యాలు, ఆటపాటలకు కదలకుండా చేసింది. బుధవారం రాత్రి 7.40గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాగునీటి దినోత్సవాన్ని మంత్రి సత్యవతిరాథోడ్ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వచ్చి వేడకలకు వీక్షించారు. సావిత్రి(శివజ్యోతి) యాంకరింగ్ ఆకట్టుకుంది. ఆమె తెలంగాణ యాస, భాషతో పలువురుని రంజింపజేసింది. ముందుగా రంజితపేరిణి శివతాండవం, మానస శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అలంరించాయి. తెలంగాణ, పంజాబీ, గుజ రాతి, కేరళ, గుస్సాడి, భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రానికి ముందు, తరువాత తెలంగాణ ముఖచిత్రం లేజర్‌షో రూరంలో ప్రదర్శించారు. గాయని మంగ్లీ 'కాళేశ్వరం అదిగో.. జల కాళేశ్వరం ' పాట పాడుతుంటే చప్పట్లు కేరింతలతో సభాప్రాంగణం మార్మోగింది. బ్యారేజీ చుట్టూర విద్యుత్ లైట్లు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. విద్యుత్ దీపాల వెలుగుల్లో బ్యారేజీ శోభాయమానంగా దర్శనమిచ్చింది.

జర్నలిస్టులు నిరసన..

సభప్రాంగణం వద్ద జర్నలిస్టులకు వెనుకాల ప్రెస్ గ్యాలరీ వేయడంలో అభ్యంతరం తెలిపారు. బైకట్ చేసి బయటికి వెళ్లిపోయారు. తర్వాత కలెక్టర్ భవేష్ మిశ్రాకు డీపీఆర్‌ఓ శ్రీధర్ సమస్యను వివరించగా.. వెంటనే వీఐపీ గ్యాలరీ వెనకాల కుర్చీలు వేయడంతో జర్నలిస్టులు నిరసన విరమించారు.

రైతుల అరెస్ట్..

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో ముంపునకు గురవుతున్న రైతులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులను ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాటారం, మహదేవపూర్ మండలాలకు చెందిన పలువురుని అరెస్టు చేశారు.

భూపాలపల్లి వారే..

సభలో ఇతర నియోజకవర్గానికి చెందిన వారు ఎక్కువగా కనిపించారు. మంథని నియోజకవర్గానికి చెందిన రైతులు, జనాలు కనిపించలేదని చర్చ జరిగింది. రేగొండ, టేకుమట్ల, భూపాలపల్లికి చెందిన వారు సభాప్రాంగణంలోకి వచ్చారు.

కుర్చీలు ఖాళీ..

మంగ్లీ ఆటపాట ప్రారంభంతో వర్షం కూడా ప్రారంభం అయింది. దీంతో కుర్చీలన్ని ఖాళీ అయ్యాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్‌లు జక్కు శ్రీహర్షిణి, గండ్ర జ్యోతి, అడిషనల్ కలెక్టర్‌లు దివాకర, ఇలా త్రిపాఠి, అసిస్టెంట్ కలెక్టర్ శివశంకర్‌ప్రసాద్, ఎస్పీ సురేందర్‌రెడ్డి, ఎంపీపీ రాణిబాయి పాల్గొన్నారు.

ఆస్తుల పంపిణీ.. అభివృద్ధి పనులు



ములుగులో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్ పక్కన మంత్రులు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, దయాకర్‌రావు తదితరులు

- ములుగులో ఉత్సాహంగా సాగిన మంత్రి కేటీఆర్ పర్యటన
- ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలతో బిజీబిజీ
- ములుగు అంటే సీఎం కేసీఆర్‌కు ఎంతో ప్రేమ
- అధికార పార్టీ ఎమ్మెల్యే లేకపోయినా అభివృద్ధి చేశామని వెల్లడి
- సీఎం కేటీఆర్ అంటూ పలుమార్లు పార్టీ శ్రేణుల నినాదాలు
- అనంతరం రామప్పలో రామలింగేశ్వరుడి దర్శనం



రామప్పలో రామలింగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న మంత్రి కేటీఆర్



కలెక్టరేట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో మంత్రులు

ములుగు/ములుగు రూరల్: ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు.. ఆస్తుల పంపిణీ కార్యక్రమాలతో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) ములుగు జిల్లా పర్యటన బిజీబిజీగా సాగింది. తెలంగాణ ఆవిర్భావ, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆయన ములుగు జిల్లాలో పర్యటించారు. ఉదయం 10.54 గంటలకు రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీతో కలిసి హెలికాప్టర్‌లో ములుగుకు చేరుకున్న కేటీఆర్.. ముందుగా, గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, డీజీపీ అంజన్ కుమార్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఇరిగేషన్ డే సందర్భంగా రామప్పలో గోదావరి జలాలకు పూజలు చేశారు. అంతకుముందు ములుగులో ఏర్పాటుచేసిన సభలో మాట్లాడారు. 'అందురూ బాగున్నారా, నీరసంగా ఉన్నారేంటి, పిడికిలెత్తి జై కొట్టండి. వరంగల్ నుంచి హైదరాబాద్ వరకు వినిపించాలి'అంటూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. దశాబ్ది ఉత్సవాల్లో సాధించిన ప్రగతిని వివరించారు. హాజరైన కార్యకర్తలు పలుమార్లు సీఎం కేటీఆర్..సీఎం కేటీఆర్ అంటూ నినాదాలు సభా ప్రాంగణం మారుమోగింది. మాజీ మంత్రి చందూలాల్ ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారంటూ ఆయన కుమారుడు ప్రహ్లాద్ పేరు కేటీఆర్ చెప్పగానే కార్యకర్తలు కేరింతలు కొట్టారు.

తన ప్రసంగం మొత్తం.. బీఆర్‌ఎస్ పాలనలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. కాంగ్రెస్, బీజేపీలను టార్గెట్ చేస్తూ సాగింది. ములుగుపై సీఎం కేసీఆర్‌కు ఎంతో ప్రేమ ఉందని, ఇక్కడ అధికార పార్టీ ఎమ్మెల్యే లేకున్నా అన్ని విధాలుగా సహకరిస్తున్నారని పలుమార్లు గుర్తు చేశారు. కాగా, సభకు వచ్చిన నాగస్వరం ఊదే కళాకారులను కేటీఆర్ మరీ దగ్గరికి పిలిచి వారితో సెల్ఫీ దిగారు. ములుగును మున్సిపాలిటీగా మారుస్తూ ఇప్పటికే శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టామని, త్వరలో అధికారిక ప్రకటన విడుదలవుతుందని చెప్పడంతో అభిమానుల్లో సంతోషం వ్యక్తమైంది.

ఆస్తుల పంపిణీ..


జిల్లాలోని 1,181 మహిళా సంఘాలకు రూ.110 కోట్ల విలువగల చెక్కును కేటీఆర్ అందించారు. గొల్ల కురుమలకు ఆరు యూనిట్ల రెండో విడత గొర్రెలను పంపిణీ చేశారు. ఎంఎస్‌ఎంఈ తరపున రూ.1.50 కోట్ల విలువైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ అధికారులు.. మంత్రి కేటీఆర్‌కు జ్ఞాపిక అందించారు. మంత్రులు సత్యవతి రాథోడ్ , ఎర్రబెల్లి దయాకర్‌రావులు కూడా కేటీఆర్‌ను శాలువాలతో సన్మానించారు.

మల్లంపల్లి మండలం ఏర్పాటు చేస్తాం

ములుగు నియోజకవర్గంలో ఇప్పటికే కన్నాయిగూడెం, గంగారం మండలాలను ఏర్పాటు చేసుకున్నామని, మల్లంపల్లి మండలం ఏర్పాటుకు ప్రజల డిమాండ్ మేరకు పక్కనే ఉన్న నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో మాట్లాడి ఒప్పిస్తామని కేటీఆర్ అన్నారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఇక ముందు ఎలాంటి ఆందోళన జరగకుండా చూస్తామన్నారు. ఎమ్మెల్యే సీతక్క కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న ములుగును కడుపులో పెట్టుకొని చూసుకుంటున్న సీఎం కేసీఆర్‌ను ఆదరించాలన్నారు. జాతీయ స్థాయిలో ములుగు జిల్లాకు అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ జెడ్పీ చైర్మన్ జగదీశ్, కలెక్టర్ కృష్ణ ఆదిత్య, సీఈఓ ప్రసూన రాణి, డీపీఓ వెంకయ్యలను శాలువాలతో సన్మానించారు. సాగునీటిపై ఇరిగేషన్ శాఖ ఏర్పాటు చేసిన రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ధనసరి సీతక్క, పెద్ది సుదర్శన్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బడే నాగజ్యోతి, మాజీ ఎంపీలు అజ్మీరా సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, రైతు రుణ విమోచన సమితి చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, వరంగల్, భూపాలపల్లి జెడ్పీ చైర్ పర్సన్లు గండ్ర జ్యోతి, జక్కు శ్రీహర్షిణి, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్, జెడ్పీటీసీ సకినాల భవాని తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటన సాగింది ఇలా..

ఉదయం **10:54** గంటలకు: హెలికాప్టర్ ద్వారా హోంశాఖ మంత్రి మహమూద్ అలీతో కలిసి జిల్లాకేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ల్యాండ్ అయ్యారు.
11:07 గంటలకు: సమీకృత కలెక్టరేట్ నిర్మాణ స్థలానికి చేరుకున్నారు.
11:13 గంటలకు: కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయానికి శంకుస్థాపన
11:24 గంటలకు: మినీ బస్‌డిపో, సేవాలాల్ భవన్‌కు శంకుస్థాపన
11:55 గంటలకు: నూతన పోలీస్‌స్టేషన్ భవనానికి చేరుకున్నారు. హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.
12:01 గంటలకు: హోంశాఖ మంత్రితో కలిసి పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు.
12:35 గంటలకు: సాధన హైస్కూల్ పక్కన ఏర్పాటు చేసిన సభ స్థలానికి చేరుకున్నారు.
2:00 గంటలకు: కార్యక్రమం ముగింపు
2:04 గంటలకు: రోడ్డుమార్గంలో రామప్పకు బయలుదేరారు.
2:35 గంటలకు: రామప్పకు చేరుకున్న కేటీఆర్, మంత్రులు
2:50 గంటలకు: రామలింగేశ్వరుడి దర్శనం.. ఆలయ పరిసరాల సందర్శన
3:45: ములుగుకు పయనం.. అక్కడినుంచి హెలికాప్టర్‌లో గుడెప్పాడ్ ఎక్స్‌రోడ్డుకు పయనం..



క్లుప్తంగా

వడదెబ్బతో 'ఉపాధి' కూలీ మృతి


మొగిలి (ఫైల్)

ఎల్కతుర్తి: మండలంలోని దండేపల్లికి చెందిన కట్కూరి మొగిలి(55) ఉపాధి హామీ కూలీ బుధవారం గ్రామశివారులోని ఊరచెరువు పూడికతీత పనులకు వెళ్లాడు. ఎండ తీవ్రతకు తీవ్ర అస్వస్థతకు గురై చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న సీపీఐ నాయకులు గ్రామానికి చేరుకొని మృతుని పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మృతుడి కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, మాలోతు శంకర్ నాయక్, నిమ్మల మనోహర్, కామెర వెంకటరమణ, మారుపాక అనీల్‌కుమార్, మద్యల ఎల్లేశ్, శనిగరం రాజకుమార్, రాజనర్సు శంకర్, తిరుమల ఉన్నారు.

కేవీకేను సందర్శించిన పీటీసీ అధికారులు


పెరటికోళ్లను పరిశీలిస్తున్న అధికారులు

కరీమాబాద్: మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని పోలీసు శిక్షణ కేంద్రం (పీటీసీ) ప్రిన్సిపాల్ పూజ, పలువురు అధికారులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అజొల్లా సాగు, పెరటికోళ్ల పెంపకం గురించి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న, పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ సాయికిరణ్ వివరించారు. పశువుల దాణాకు అనువైన పశుగ్రాసం రకాలు, వర్మీ కంపోస్టు ఎరువు తయారీ, వినియోగం, తేనెటీగల పెంపకం గురించి వివరించారు. చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులు, సమీకృత చేపల పెంపకం ప్రాముఖ్యతను మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ గణేశ్ తెలి పారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్, భిక్షపతి, ఇన్‌స్పెక్టర్లు కాశీరాం, చంద్రశేఖర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సోదరుడి ఇంట్లో చోరీ

వర్ధన్నపేట: తన తోబుట్టువు లేని సమయంలో ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు బంగారం, నగదు దోచుకెళ్లాడని సోదరుడి కుమారుడు ఓర్సు శివకుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని వడ్డెరకాలనీలో ఓర్సు రాజు బతుకుదెరువు కోసం బీదర్‌కు వెళ్లాడు. శివకుమార్ హనుమకొండకు వెళ్లి చదువుకుంటూ వస్తూపోతూ ఉంటాడు. బుధవారం ఉదయం రాజు సోదరుడు ఎల్లస్వామి రాజు ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉండడంతో తాళాన్ని పగులగొట్టి నిత్యావసర వస్తువులను ధ్వంసం చేసి ఇంట్లో ఉన్న నాలుగు తులాల బంగారం, రూ.50 వేల నగదును దోచుకెళ్లాడని శివకుమార్ ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.



ఖాకీల 'ఎమోషనల్ కాంప్రమైజ్'!



పోక్సో కేసుల్లో కొందరు అధికారుల తీరే వేరు
- పెద్దమనుషుల ద్వారా రాజీ కుదిర్చేలా బేరసారాలు
- బాధితులకు భవిష్యత్ భయం చూపిస్తూ రాజీయత్నం
- కొన్ని సందర్భాల్లో కేసు తీవ్రత తగ్గించే సెక్షన్ల నమోదు
- 2013 నుంచి 100 పోక్సో కేసులకు పైగా నమోదు
- ఇప్పటివరకు ఆరింటిలోనే నిందితులకు శిక్ష
- శిక్షలశాతం పెంపుపై సీపీ దృష్టి సారించాల్సిందే

సాక్షి, వరంగల్: లైంగిక నేరాలనుంచి బాలలను సంరక్షించేందుకు తీసుకొచ్చిన పోక్సో చట్టం 'ఎమోషనల్ కాంప్రమైజ్'ముందు వెలవెలబోతోంది. జరిగిందేదో జరిగింది...లైంగిక దాడి చేసిన వ్యక్తికి జైలుశిక్ష పడడం వల్ల మీకు ఏం వస్తుంది...మీ పరువు ఏం కావాలి...భవిష్యత్‌లో ఎవరికైనా తెలిస్తే పెళ్లి చేసుకుంటారా... అంటూ తొలుత తియ్యటి మాటలు...ఆపై గద్దరింపులు చేస్తూ...ఆయా ప్రాంత పెద్ద మనుషులతో కలిసి కొందరు పోలీసులు చేస్తున్న 'ఎమోషనల్ కాంప్రమైజ్'పోక్సో కేసులను నీరుగారుస్తోంది. ఒకవేళ బాధితులు చెప్పితే వినకపోయినా చార్జిషీట్ దాఖలు చేయడంలో కొందరు సిబ్బంది ఆలసత్వం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. 2013 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 100 పోక్సో కేసుల్లో ఆరింటిలో మాత్రమే నిందితులకు జైలుశిక్ష పడిందంటే కేసు విచారణలో పోలీసుల పనితీరు కళ్లకు కడుతుందన్న విమర్శలున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో మహిళ శిశు సంక్షేమ విభాగ పరిధిలోకి వచ్చే బాలల సంరక్షణ విభాగం నుంచి 100 మంది పోక్సో కేసు బాధితులకి రూ.46లక్షలు నష్టపరిహారం అందింది.

కొందరు అధికారులు ఏం చేస్తున్నారంటే...

ఎవరైనా తమ కుమార్తె కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఐపీసీ 363 (మిస్సింగ్ కేసు) నమోదు చేస్తున్నారు. వారం రోజుల తర్వాత వీరు వచ్చినా...కొందరు పోలీసులు ఇరువురి తల్లిదండ్రులను పెద్దల ద్వారా పిలిపించుకొని కాంప్రమైజ్ చేస్తున్న దాఖలాలు ఉన్నాయి. ఫలానా వ్యక్తితో వెళ్లిపోయిందని తెలిస్తే మీ పాప భవిష్యత్‌కే కష్టమంటూ బాలిక తల్లిదండ్రులను ఒప్పించి...యువకుడి తరపు నుంచి భారీగా డబ్బులు లాగేస్తున్నారు. ఈ విషయం అందరికీ తెలిసిందనుకుంటే నిందితులకు పెద్దగా ఇబ్బంది లేకుండా ఉండే సెక్షన్లతో కేసులు నమోదుచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వాస్తవానికి బాలికను లైంగికంగా దాడి చేస్తే ఐపీసీ 376 సెక్షన్ అండర్‌సెక్షన్ ఆఫ్ 3,4,5,7,8,9 రెడ్‌విత్‌ల కింద కేసు నమోదు చేయాలి. వీటిలో సెక్షన్ 3, సెక్షన్ 5, సెక్షన్ 7 తీవ్రనేరాల కింద జీవితఖైదు పడే అవకాశముంది. కానీ కొందరు అధికారులు కేసు తీవ్రత తగ్గించేందుకు సెక్షన్ 11 ఆఫ్ పోక్సో యాక్ట్ 2012 (మూడేళ్లలోపు శిక్ష పడే అవకాశం) నమోదు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చార్జిషీట్ వేసే సమయానికి బాధితురాలు, నిందితుల మధ్య కాంప్రమైజ్ ఫార్ములాను మధ్యవర్తులైన పెద్దల ద్వారా చేస్తూ కొందరు అధికారులు రూ.లక్షల్లో సంపాదిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. తాజాగా నర్సంపేట పట్టణంలో ఓ పోలీస్ అధికారి సమక్షంలోనే కాంప్రమైజ్ చేస్తూ డబ్బులు ఇప్పించేలా పెద్దలు చేసిన తీర్మానంపై బాధిత బాలిక సీపీ రంగనాథ్‌కు చేసిన ఫిర్యాదుతో ఈ తెరచాటు బాగోతం బయటకు వచ్చింది. ఇలాంటివి వెలుగులోకి రాని కేసులు కోకొల్లలుగా ఉంటాయన్న టాక్ పోలీసు వర్గాల్లోనే ఉంది.

మచ్చుకు...

గతంలో పర్వతగిరి ఠాణా పరిధిలో 17 ఏళ్ల బాలిక కనిపించడం లేదంటూ ఐపీసీ 363 సెక్షన్ నమోదైంది. 20 రోజుల తర్వాత తిరిగి వచ్చిన బాలిక నిందితుడితో పోయింది వాస్తవమేనని, నేను మా అక్క వాళ్ల ఇంటివద్ద ఉంటే, తాను వేరే వద్ద ఉన్నాడని పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నట్టుగా తెలిపారు. సదరు బాధితురాలు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు మాత్రం తనను నిందితుడు లైంగికంగా లోబర్చుకున్నాడని చెప్పడంతో ఆ కమిటీ సభ్యులు పోలీసులకు చెప్పారు. అయినా కూడా ఆ కేసులో ఎలాంటి సెక్షన్లు మారకపోవడంతో ముడుపులు భారీగానే చేతులు మారొచ్చన్న విమర్శలు ఉన్నాయి.

కేసీఆర్ బాటలో కేటీఆర్



మాట్లాడుతున్న రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ

ములుగు/ములుగు రూరల్: సీఎం కేసీఆర్ బాటలోనే మంత్రి కేటీఆర్ నడుస్తూ ప్రజలను ఏకతాటిపైకి తీసుకొస్తున్నారని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ములుగు జిల్లాలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్ర ప్రజలు రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలను చూసేందుకు వస్తున్నారని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ తరపున కేంద్ర, రాష్ట్రాల్లో ఎక్కువ అవార్డులు రావడంపై అభినందనలు తెలిపారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ గత సంవత్సరం జూలైలో సీఎం కేసీఆర్ ములుగు జిల్లాకు వచ్చిన సందర్భంగా మున్సిపాలిటీకి హామీ ఇచ్చిన విధంగానే అందుకనుగుణంగా శాసనసభలో ప్రవేశపెట్టామని తెలిపారు. వరంగల్ నుంచి ములుగు వస్తుంటే గట్టమ్మకు ఇరువైపుల జరిగే అభివృద్ధి పనులు చూసి ములుగునా హైద్రాబాద్ అని అనుకునే విధంగా ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వ తీరుతో ఇప్పటి వరకు గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కాలేదన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ గత కాంగ్రెస్ హయంలో ఏటూరునాగారం, మంగపేట మండలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడ్డామని నేడు కేసీఆర్ హయాంలో రహదారులను ఏ విధంగా అభివృద్ధి చేసుకున్నామని ప్రజలు గమనించాలని అన్నారు. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అభివృద్ధి చేయడం చేతకాక ఇక్కడికి వచ్చి ఉపన్యాసాలు చేస్తారని వారికి కొంచెం సిగ్గుండాలన్నారు. నియోజకవర్గంలో అభ్యర్థిని ఎవరిని ప్రకటించినా 30 వేల మెజారిటీతో గెలిపించాలని పేర్కొన్నారు.

జర్నలిస్టులకు శుభవార్త..

ములుగు పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్ జర్నలిస్టులకు శుభవార్త తెలిపారు. కోరిన విధంగానే ఇండ్ల పట్టాలు అందించి కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు అందించిన వినతిపత్రంపై మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రులు సత్యవతిరాథోడ్, ఎర్రబెల్లిలకు సిఫారసు చేశారు. అక్కడే ఉన్న కలెక్టర్‌తో మంత్రులు మాట్లాడారు. వారం రోజుల్లో పట్టాలు సిద్ధం చేసి అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

నాలుగున్నర గంటలు ఆలస్యంగా 'గోల్కొండ'


ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై రైలు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

డోర్నకల్ : మూడో రైల్వేలైన్ నిర్మాణ పనులతో పాటు పలు రైళ్ల రద్దుతో బుధవారం సికింద్రాబాద్ వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ నాలుగున్నర గంటలు ఆలస్యంగా నడిచింది. గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోల్కొండ డోర్నకల్ స్టేషన్‌కు ఉదయం 8.53 నిమిషాలకు రావాల్సి ఉండగా 12.50 గంటలకు చేరుకుంది. స్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫారంపైకి గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రావాల్సి ఉండగా ఆ సమయంలో అదే ప్లాట్‌ఫారంపై గూడ్స్ రైలు నిలిచి ఉండటంతో 4వ నంబర్ ప్లాట్‌ఫారంపైకి రావడంతో 1 నుంచి 4వ నంబర్ ప్లాట్‌ఫారంకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మీదుగా చేరుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు అరగంట పాటు స్టేషన్‌లో నిలిచిన గోల్కొండ 1.21 గంటలకు కదిలింది. విజయవాడ నుంచి షిరిడి వెళ్తున్న షిరిడి ఎక్స్‌ప్రెస్ సుమారు గంట ఆలస్యంగా మూడో నంబర్ ప్లాట్ ఫారం మీదుగా వరంగల్ వైపు వెళ్లింది. తీవ్రమైన ఎండలు, ఉక్కపోత, వడగాలులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

హనుమకొండలో 'మాయ' లేడీ

- బట్టలు విక్రయించి బురిడీ కొట్టించిన మహిళ
- రూ.1.50 కోట్లతో పరారీ

వరంగల్ క్రైం : హనుమకొండ నయీంనగర్ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఆర్థికంగా ఉన్న మహిళలను టార్గెట్ చేసుకొని ప్రణాళికతో వారికి దగ్గరై సుమారు రూ.1.50 కోట్లతో ఉడాయించిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుమారు 8 మంది బాధితుల నుంచి రూ.1.50 కోట్లు వసూలు చేసి ఆరు నెలలుగా ముఖం చాటేసిన సంఘటనపై బాధితులు లబోదిబోమని రోదిస్తున్నారు. నయీంనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఖరీదైన బట్టలు తెచ్చి అమ్మకాల పేరుతో సదరు బాధితులకు దగ్గరై వడ్డీ ఆశ చూపి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. ఆరునెలల క్రితం డబ్బులు ఇవ్వాలని బాధితులు ఒత్తిడి తేవడంతో నగరం నుంచి ఉడాయించినట్లు తెలిసింది. ఏమి చేయాలో తెలియక పలు ప్రాంతాల్లో డబ్బులతో ఉడాయించిన మహిళ కోసం వెతికినప్పటికీ అచూకీ తెలియకపోవడం, ఫోన్ స్విచ్చాఫ్ చేయడంతో బాధితులంతా టాస్క్‌ఫోర్స్ పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. మాయలేడి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి


సుమలత మృతదేహం

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. విద్యుదాఘాతంతో ఒకరు, నీటి సంపులో పడి బాలుడు, రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడ్డారు.

పర్వతగిరి: మండలంలోని చింతనెక్కొండ గ్రామపరిధిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల పక్కన రేకులషెడ్డులో నివసిస్తున్న నరిగే సుమలత(26) బుధవారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. నర్సంపేట మండలం రాజుపేటకు చెందిన కోతి సరోజనకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురు సుమలతను చింతనెక్కొండకు చెందిన నరిగే పూర్ణచందర్‌కు నాలుగేళ్ల క్రితం ఇచ్చి వివాహం చేశారు. వివాహం జరిగిన నాటి నుంచి సుమలత, పూర్ణచందర్ నర్సంపేటలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. మూడు నెలల క్రితం చింతనెక్కొండలో కొందరు డబుల్ బెడ్రూం ఇళ్ల పక్కన గల ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకుంటున్నారని తెలిసి భార్యభర్తలు చింతనెక్కొండకు వచ్చి డబుల్ బెడ్రూం ఇళ్ల పక్కన చిన్న రేకులషెడ్డు వేసుకుని జీవిస్తున్నారు. బుధవారం ఉదయం సుమలత బట్టలు ఇనుపతీగపై ఆరవేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తల్లి సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడి..


మధుసూదన్(ఫైల్)

చిన్నగూడూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలోని మంచ్యాతండా శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ మండలం గడ్డిగూడేనికి చెందిన దారావత్ మధుసూదన్(30) ఉగ్గంపల్లిలోని దేవోజీతండాలో తన చెల్లి ఇంటికి వచ్చాడు. మరిపెడ మండలంలోని జమ్మికుంట తండాలో ఉన్న తన స్నేహితున్ని కలిసి వస్తానని తన బావ, చెల్లికి చెప్పి బుధవారం ఉదయమే వెళ్లిపోయాడు. అదే రోజు మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో మండలంలోని ఉగ్గంపల్లి మంచ్యాతండా శివారులో మలుపు వద్ద ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పి ప్రక్కనే ఉన్న కాలువలో పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మధుసూదన్ మహబూబాబాద్ జిల్లా ఏరియా ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ప్రమాదంలో రోడ్డు ప్రక్కన అనుమానాస్పదంగా పడి ఉన్నట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు.

నీటిసంపులో పడి బాలుడి..


శ్రీహన్స్ (ఫైల్)

కమలాపూర్: మండలంలోని కన్నూరు గ్రామానికి చెందిన శ్రీరాముల సంతోష్–ఉమ దంపతుల కుమారుడు శ్రీహన్స్ (3) ప్రమాదవశాత్తు నీటిసంపులో పడి మృతి చెందాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీహన్స్ బుధవారం మధ్యాహ్నం సమయంలో ఇంటి ముందు ఆడుకుంటూ వెళ్లి ఇంటి ముందున్న నీటిసంపులో పడి ఉన్నాడు. కాసేపటి తర్వాత బాలుడి తల్లి శ్రీహన్స్ కోసం వెతుకగా బాలుడు నీటి సంపులో విగతజీవిగా కనిపించాడు. బాలుడి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ ..


స్వామి మృతదేహం

నర్మెట: రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన నర్మెట శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని వెల్దండకు చెందిన గోల్కొండ స్వామి (36) హైద్రాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నర్మెట నుంచి ఆటోలో జనగామకు వెళ్తుండగా నర్మెట–హన్మంతాపూర్ మధ్యలో ఆటోలో నుంచి కిందపడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రుడిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై గైకాడి అనిల్‌కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడి మృతి


అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసిన మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్ : వ్యవసాయ పనులు చేస్తుండగా ట్రాక్టర్ బోల్తాపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని నాంచారిమడూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మూల ఉజ్వల్‌రెడ్డి (23) ట్రాక్టర్ నడుపుతూ వ్యవసాయ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు బోల్తాపడడంతో ట్రాక్టర్ క్రిందపడిన ఉజ్వల్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం అనంతరం గ్రామానికి తరలించారు.

మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

మండలంలోని నాంచారిమడూరులో ప్రమాదవశాత్తు మృతి చెందిన మూల ఉజ్వల్‌రెడ్డి కుటుంబాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం సాయంత్రం పరామర్శించారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మంత్రి మృతుడి తండ్రి మూల కృపాకర్‌రెడ్డిని ఓదార్చి సానుభూతిని తెలిపారు. కుటుంబానికి మనోధైర్యం కల్పించి, అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. మంత్రి వెంట మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మృతదేహంతో అత్తింటి ఎదుట ఆందోళన

- మే 20న భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భర్త
- చికిత్స పొందుతూ మృతి చెందిన భార్య
- ఇల్లు వదిలిపెట్టి పరారైన అత్త,మామ, మరిది
- పోలీసుల అదుపులో భర్త భూక్యా శ్రీధర్



మృతదేహంతో అత్తింటి ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు


స్నేహ (ఫైల్)

గార్ల : తన కూతురు మృతికి కారకులైన భర్త, అత్త, మామ, మరిదిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాత్రి కూతురు మృతదేహాన్ని అత్తగారి ఇంటి ఎదుట పెట్టి బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కట్టుగుట్టతండాకు చెందిన భూక్యా శ్రీధర్‌కు, కొత్తగూడెంకు చెందిన స్నేహ (24) తో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. భర్త శ్రీధర్ తరుచూ వేధింపులకు పాల్పడుతుండటంతో భార్య తన పుట్టింటికి వెళ్లింది. మే 20న భర్త కొత్తగూడెం అత్తగారి ఇంటికి వెళ్లాడు. వెళ్లేటప్పుడు పెట్రోల్ తీసుకొని వెళ్లాడు. భర్త వచ్చాడని భార్య వంటగదికి వెళ్లి అన్నం పెడుతుండగా వెంట తీసుకొచ్చుకున్న పెట్రోల్ భార్యపై పోసి నిప్పంటించి పరారయ్యాడు. 80 శాతం కాలిన స్నేహ 16 రోజుల పాటు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం స్నేహ మృతదేహాన్ని నేరుగా అత్తగారి ఇంటికి కట్టుగుట్టతండాకు తీసుకొచ్చి తన కూతురుకు న్యాయం జరిగేంత వరకు మృతదేహానికి దహన సంస్కారాలు చేసేది లేదంటూ ఇంటిఎదుట పెట్టి మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. స్నేహ మృతి చెందిన విషయం తెలుసుకున్న అత్త, మామ, మరిది ఇంటి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న గార్ల, బయ్యారం సీఐ బాలాజీ, ఎస్సై బానోత్ వెంకన్న పోలీస్ సిబ్బందితో వెళ్లి గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బాధితురాలి తల్లితండ్రులకు సర్దిచెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. స్నేహ మృతికి కారకులైన భర్త, అత్త, మామ, మరిదిని ఇంటికి రప్పించే వరకు మృతదేహాన్ని తీసేది లేదంటూ కుటుంబ సభ్యులు పట్టుబట్టారు. మృతురాలికి న్యాయం జరిగేంత వరకు శవాన్ని తీసేది లేదని పోలీసులకు తెగేసి చెప్పారు. మృతురాలి అంత్యక్రియలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలియరాలేదు.

అభినవ వ్యాసుడు దాశరథి రంగాచార్యులు

- నేడు రంగాచార్యులు 9వ వర్ధంతి


రంగాచార్యులు(ఫైల్)

చిన్నగూడూరు : మలిదశ తెలంగాణ ఉద్యమానికి నాంది పలికిన గ్రామంగా నిలిచిన చిన్నగూడూరు నేడు మండల కేంద్రంగా విరాజిల్లుతుంది. అందుకు నిదర్శనం దాశరథి సోదరుల స్ఫూర్తితోనే. బుధవారం దాశరథి రంగాచార్యుల వర్ధంతి సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు(ప్రస్తుతం మండలం)లో వెంకటాచార్యులు–వెంకటమ్మ పుణ్య దంపతులకు 24 ఆగస్టు 1928 సంవత్సరంలో దాశరథి రంగాచార్యులు జన్మించారు. వారి విద్యాభ్యాసం ఖమ్మం జిల్లాలో సాగింది. 12 ఏళ్లకే సాహిత్యంపై మక్కువ పెంచుకున్నాడు. నాడు తెలంగాణ పల్లెలో నాటి జీవన విధానాన్ని ఆయన రాసిన నవలల్లో కళ్లకు కట్టినట్లు అద్దం పట్టాయి. చిల్లర దేవుళ్లు, మోదుగుపూలు అనే నవలలు ఆయనకు ఎనలేని కీర్తిని సంపాదించి పెట్టాయి. నిజాం పాలనలో అరాచకాలు, పెత్తందార్ల దోపిడీ నుంచి ప్రజలను విముక్తి చేసేందుకు ఉద్యమబాటలో నడిచాడు. తన రచనల ద్వారా తెలంగాణ ప్రజలను ఏకం చేసి చెరగని ముద్ర వేసుకున్న దాశరథి రంగాచార్యులు సాహితీవేత్తగా, సాయుధ పోరాట యోధుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు తెచ్చుకున్నారు. 1942 సంవత్సరంలో స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీతో పలు నినాదాలు చేశారు. అందులో భాగంగానే స్వాతంత్ర్య పోరాటం తెలంగాణ సాయుధ పోరాటంలో భాగస్వాములయ్యారు. ఇదే స్ఫూర్తితో సిద్ధాంతం కన్నా కర్తవ్యం గొప్పదని, విశ్వాసం కన్నా కర్తవ్యం గొప్పదని చాటి చెప్పిన మహనీయుడు దాశరథి రంగాచార్యులు. ఈయన రాసిన నవలలు ఒక తెలంగాణకు పరిమితం కాకుండా యావత్ భారతదేశం వ్యాపించి కీర్తి గడించాయి. ఉపాధ్యాయుడిగా, గ్రంథాలయ నిర్వాహకుడిగా, సికింద్రాబాద్ పురపాలక శాఖలో ఉద్యోగిగా విధులు నిర్వర్తించారు. నాలుగు వేదాలను పది ఉపనిషత్తులను తెలుగులోకి అనువదించారు. రామాయణ, భారత, భాగవతాలను సరళ వచనంలో రాశారు. ఆయన రాసిన చిల్లర దేవుళ్లు రచనకు ఆంధ్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 1980లో వెంకటశివయ్య సాహితీ పురస్కారం, 2000 సంవత్సరంలో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి సాహిత్యంలో విశిష్ట పురస్కారం అందుకున్నారు. తెలుగు సాహిత్య రచనల్లో సుస్థిర స్థానం సంపాదించాడు. 2015 జూన్ 8న సికింద్రాబాద్‌లో ఆయన తుది శ్వాస విడిచారు. దాశరథి సోదరుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసి వారికి సముచిత స్థానం కల్పించాలని స్థానిక మండల ప్రజలు కోరుతున్నారు.

వధూవరులకు కేటీఆర్ ఆశీర్వాదం


జాహ్నవి రెడ్డి–అంకిత్ రెడ్డి దంపతులను ఆశీర్వదిస్తున్న మంత్రులు కేటీఆర్, మహమూద్‌అలీ, దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ తదితరులు

దామెర: పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కూతురు జాహ్నవిరెడ్డి–అంకిత్‌రెడ్డిల వివాహ రిసెప్షన్ బుధవారం హనుమకొండ జిల్లా దామెర మండలం దుర్గంపేట్ సమీపంలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కేటీఆర్ వెంట మంత్రులు మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, డీజీపీ అంజన్ కుమార్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, శంకర్ నాయక్, తాటికొండ రాజయ్య, అరూరి రమేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్యతోపాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పరకాల నియోజకవర్గ నాయకులు, తదితరులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

- ఓగ్లాపూర్ పవర్ గ్రిడ్‌కు ఎదురుగా 200 ఫీట్ రోడ్‌కు ఆనుకొని కాంపౌండ్ కట్టి ఉన్న ప్లాటు (వెడల్పు 30 పొడవు 120) 400 చ॥గ॥ ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 9849544437. [W-785590]

HOUSE FOR SALE

- GWMC అప్రూవ్డ్ లే అవుట్ చింతగట్టు హన్మకొండలో విల్లా ప్లాట్లు 4BHK డూప్లెక్స్ హౌస్ 3BHK ఇండిపెండెంట్ హౌజింగ్ ప్రాజెక్టులో బుకింగ్ ప్రారంభమైనవి. శ్రీనివాస్. సెల్: 8978638094. [W-785601]

SERVICES

CHANGE OF NAME

- I, SUDHARANI K (Old Name) D/o. K. Yadagiri, R/o. H.No. 10-2-200/1, Opposite Srinivasa Residency, Girmajipet, District: Warangal, T.S., have changed my name as SUDHARANI MANISH RAMTEKE (New Name) W/o. Manish Govind Ramteke solemnly declare. [W-785591]

LOANS

- సులభంగా లోన్ పొందండి. అతి తక్కువ వడ్డీతో, అన్ని రకాల లోన్స్, ఉద్యోగస్తులు, వ్యాపారులు, వైద్యులు (NRI) సంప్ర॥ JS ఎంటర్‌ప్రైజెస్, ఖమ్మం. భద్రాద్రి కొత్తగూడెం. 8520970781, 7842830781. [M-1221172]

WANTED

- Nurses, GNM, ఫార్మసిస్ట్, (Male) సూపర్‌వైజర్స్ కావలెను. సంప్ర॥ గార్డియన్ హాస్పిటల్, Opp: L.B. కాలేజీ, ములుగు "X" రోడ్ వరంగల్, 12 to 2 PM. [WA-0232]
- సెక్యూరిటీ గార్డ్స్ కావలెను, హన్మకొండ, వరంగల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 13000–16000. సంప్ర॥ 9703637320. [W-785587]

- ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్, ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786393]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221311]

WANTED TEACHERS

- Wanted Teachers to teach Primary Science, 1 to 5th Social, 6th to 9th Hindi and English Cont: KIWI Public School, SRR Thota, Warangal. Cell: 9849795066. [WA-13141]
- Lady Teachers: Mother Teachers for Pre-Primary, Hindi & supporting teacher for 1st-5th, Maths Teachers for 3rd to 7th Class fluent in Eng. are preferable, Indian Kids School, S.V.N road, WGL. Cell: 9963006221. [W-785589]
- Wanted teachers, to teach preprimary, Primary (all subjects), High SCL (Hindi, Maths, Science). Whatsapp your resume to 9154665006, Masster High School. Fort Warangal. [W-785585]
- Pre-Primary, Primary All Subjects (I-IV), Middle School (V-VII), High School (VIII, IX, X) All Subjects & PET, Substitute Teachers, Drawing Teacher, Wardens (M/F). Avanthi High School, Hunter Road, HNK. 9666025025, 9666024024 [WA-27081]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.